# బల్లిశకునం - బంధుదర్శనం

శ్రీ చిక్కాల భూపతిరావు

శర్మగారు పొడుముకాయకోసం బల్లను తడుము చుండగా తలవనితలంపుగా అటకమీదనుండి బల్లి శర్మ గారిమీద పడింది. శర్మగారు ఏమిటోయని కంగారుపడ్డారు. తలనుపైకెత్తి బల్లను తడుముతూ వుంటే, ఆబల్లి శర్మ గారి ముఖమును ముద్దుపెట్టుకొని ఒక్కగంతువేసి ఒక మూలకు పోయింది.

శర్మగారి ముఖముమీద బల్లిపడుటచేత పొడుముకాయ మాట మరచిపోయి బల్లిపడినకారణము తెలిసికోటానికి పంచాంగం తొడమీదపెట్టుకొని మరిరెండుకళ్లను అద్దెకు తీసుకొని పేజీలు తిరుగవేస్తున్నాడు. శర్మగారు చూసిన పంచాంగంలో ఈవిధముగాయుంది—

పాదము.... ప్రయాణము
తొడ.... తల్లికి, తండ్రికిపీడ
శిరస్సు.... కలహము

ముఖము.... బంధుదర్శనం అని శర్మగారు చదువు చుండగా, ఈసమయమున భార్యవచ్చి ఏమిటని ప్రశ్నించింది.

శర్మగారు భార్యతో, "ఏముందే ; పొడుముకాయకోసం నేనుబల్లమీద చేయిపెడితే వెధవబల్లి నాముఖంమీద పడింది. బల్లిపడినకారణ మేమిటా యని పంచాంగం చూస్తే ముఖం.... బంధుదర్శనము అని వుంది. కానీకూడా లేని ఈరోజుల్లో ఏబంధువులు వస్తారో ? ఎవరువచ్చినా సరే నేనుఇంట్లోలేననిచెప్పేయ్ " అని శర్మగారు అంటూండగా 'శర్మగారూ ' అనే కేక వినపడింది.

శర్మగారు గత్యంతరంలేక 'ఎవరువారూ ? ' అంటూనే బయటికి వచ్చాడు,

పోష్టుమేన్ : - నేనండీ ; మీకొక వి. పి. పార్శిలు వచ్చిందండీ.

శర్మ : - అది ఎక్కడనుండి ఎవరు పంపించారో కాస్త చూచిచెప్పు నాయనా.

పోష్టుమేన్ : -(పార్శిలుచూచి)రామకృష్ణ, కాకినాడ అని ఉన్నదండీ.

శర్మ : —(తలపంకించి) ఒహో మాబావమరిదిదా ఎంతచెల్లించి విడిపించుకోవాలి నాయనా ?

పోష్టుమేన్ : -పదిరూపాయల తొమ్మిదణాలండీ.

శర్మ : —అయ్య బాబోయ్ ; పదిరూపాయలే ; అయితే నాదగ్గరపదికానులు కూడాలేవు. దయవుంచిపార్శిలు తిరిగి పంపించేయిబాబు.

పోష్టుమేన్ సరేలెండి యని వెళ్లిపోవు చుండగా ఈ సంభాషణలే వింటూన్న పంతులుభార్య ఒక్కఅడుగులో మేడమీదకు వెళ్లేలోపుగాఅక్కడ కొచ్చి మాతమ్ముడు ఏవోవస్తువులు పంపిస్తే తిరిగిపంపేస్తున్నారా ? అనినోరు తిరగకుండా ఏవేవో మాట్లాడింది. శర్మ విధిలేక పోష్టు మేన్‌ను పిలిచి పదిరూపాయలతొమ్మిదణాలుచదివించి పార్శిలువిడిపించాడు.

శర్మగారుబావమరిది ఏమిపంపించాడో అని ఆతురత తో పార్శిలు విప్పగా అందులో ఒకఫొటో, ఒకఉత్తరం వుంది. ప్రియమైన అక్కగారికి ;

మీప్రియసోదరుడు రామకృష్ణశాస్త్రి హృదయపూర్వకంగా నమస్కరించివ్రాయులేఖ....

నన్నుమీరు చూచి చాలాకాలమయినది. నేనుఅచ్చటికి రావా లను కున్నాను. కానినాకు తీరికలేకపోవుటచేత నాఫొటోను ఈపార్శిలుద్వారా పంపించియున్నాను.

ఈనాఫొటోను మీరుచూచి నేనేస్వయముగా అక్కడికి వచ్చితి ననిఅనుకొంటా రనితలుస్తూ యున్నాను. తరువాత విషయమేమిటంటే ఈఫొటోను తీయుంచుకొనుటకు నాదగ్గర పైకములేకపోవుటచేత ఫోటోగ్రాఫర్‌చేత పోష్టు ఖర్చులతో సహా వి. పి. చేయింతిని.

ఇంతేసంగతులు.

అన్యధాతలంచవద్దు.

ఇట్లు
మీరాము.

అనిశర్మగారు ఉత్తరాన్ని చదవడంముగించగానే శర్మ గారిభార్య చూచారూ ? " బల్లిశకునం ... బంధు దర్శనం" అంటూలోనికి పోయింది. శర్మవెర్రిమొఖం వేశాడు.